# చైతన్యం

మనిషిలో జన్మతః మానవత్వం ఉంటుంది. పరిస్థితుల ప్రభావానికి బానిసైతే అతనిలో దానవత్వం ప్రవేశిస్తుంది. సూరయ్యకు మనవడు మార్తాండ్ కొరకరాని కొయ్య అయ్యాడు. సూర్యుడు ఒక్కడే. అయితే అతని నామధేయాలు అనేకం. సూర్యుడు ఒక్కడే. అయినా అతని రూపాలు అనేకం. ఉదయిస్తున్న సూర్యుడు బాలభానుడు. జగత్కళ్యాణకారుడు. అతని అంబరప్రవేశంతో అంతా అరుణమయమౌతుంది. పక్షులు గూళ్ళను విడుస్తాయి. ప్రకృతి శోభిస్తుంది. రెండు బారల వేళ సూర్యుడి రూపం మారుతుంది. అతనిలో అంతటి చల్లదనమూ ఉండదు, తీక్షణతా ఉండదు. మిట్టమధ్యాహ్నాం అతను మండుతున్న మార్తాండుడి రూపం ధరిస్తాడు. సెగలు పొగలు కక్కుతాడు. జనాలు అతడ్ని చూడడానికి భయపడతారు. చల్లదనంకోసం ఇతర సాధనాలను ఆశ్రయిస్తారు ఆ తాపాన్ని భరించలేక–అస్తమిస్తున్న సూర్యుడి అందమే వేరు. ఆకాశమంతా కుంకుమ పరుచుకుంటుంది. పక్షులు కిలకిలారావాలతో గూళ్ళు చేరుతాయి. ఆ తరువాత అతడ్ని సంధ్య కబళిస్తుంది.

తాను అస్తమిస్తున్న సూర్యుడైతే మనవడు మధ్యాహ్నమార్తాండుడు. వాడిలో ఉద్రేకం పాలు ఎక్కువ. తనని ఆదుకోని సంఘంమీద కసి. ఎలాంటివాడు ఎలాంటి వాడౌతాడో అన్న భయం సూరయ్యకు వేసింది.

“తాతయ్యా! నా మాట నిలుపుకున్నాను. ఇంక నీవు రిక్షా తొక్కడం మానెయ్యి. తాతయ్యా నీ కోసం ఏం తెచ్చానో చూడు” ఆనందంతో మనవడు అంటూ వుంటే సూరయ్యా పొంగిపోయాడు.

“ఏం తెచ్చావు తాతా?” అన్నాడు మనవడితో. బూందీ లడ్డూలు, మైసూర్‌పాక్‌లు, జిలేబీలు, రసగుల్లాలు, దోశెలు, చపాతీలు, పకోడీలు, దుకాణం పెడుతున్నట్లు తాతయ్య ముందు పొట్లాలు విప్పి పెట్టాడు. “ఇంక రోజూ నీకు ఇలాంటివి తినక తప్పదు” అన్నాడు మార్తాండ్.

“ఏమిటిరా? ఎక్కడిదీ డబ్బు? ఉద్యోగం దొరికిందా? అడ్వాన్సు తీసుకున్నావా? మనం మహారాజులమా రోజూ ఇలాంటివి తినడానికి? రెండు పూటలా పట్టెడన్నం చాలురా!”

“నాకా ఉద్యోగం ఎవరిస్తారు?”

"మరి...?"

"డబ్బుసంపాదించాలంటే ఉద్యోగం ఒక్కటే సాధనమా?"

"కూలి పని దొరికిందా?"

"అది మాత్రం ఎవరైనా పారేసుకున్న వస్తువా దొరకడానికి?"

"మరి డబ్బెక్కడిదిరా? ఇన్ని కొనుక్కొచ్చావు?"

తన మనవడు జేబుదొంగ ఔతాడని సూరయ్య కలలో కూడా ఊహించలేదు. అయితే తనలా రిక్షా నడుపుతాడు లేదా వాడి అదృష్టం కలసి వస్తే అర్ధాయుష్కుడైన తన కొడుకులా ఉద్యోగం చేస్తాడు. అందుకేగా తను చావకుండా బ్రతికింది.

"ఏం జవాబు చెప్పవేం? ఏ ధర్మాత్ముడి జేబో కొట్టావా? నీ వాలకం చూస్తే అలాగే వుంది."

"తాతా! జేబు అయితే కొట్టాను. కాని ఏ ధర్మాత్ముడిది కాదు."

"పాపిష్టి సొమ్మురా అది."

"పాపిష్టి సొమ్ము ఎలాగౌతుంది? నా కష్టార్జితం.

సూరయ్య మనవడు తెచ్చిన ఏ వస్తువునూ ముట్టుకోలేదు.

"బీదల్ని నిలువునా దోచుకుని పందికొక్కులా బలిసిపోయిన వారిదగ్గర దోచుకుంటే అది పాపపుసొమ్ము ఎలాగౌతుంది. వారికీడబ్బు ఒక లెక్కా?"

ఆనాటి నుంచి ఆ ఇంటిలో రెండు వేరువేరు ధ్రువాలు కలసి ఉంటున్నాయి. సూరయ్య బాడుగ రిక్షా ఓనరుకి అప్పచెప్పి, దారిలోనే ఏ బడ్డీలోనో ఇంత తిని రాత్రి ఇంటికి వస్తాడు. మార్తాండ్ అర్ధరాత్రో తెల్లవారుఝామునో వస్తాడు. వాడు వచ్చేవరకు సూరయ్యకు నిద్రపట్టదు. వచ్చిన తరువాత మనసు కుదుటపడుతుంది. అంతలోనే రేపు అనేది ఉందని గుర్తుకొచ్చి నిద్రను కాజేస్తుంది. కోడికూసేవేళ కునుకు తీస్తాడు. మళ్ళీ సూర్యోదయంతోనే లేస్తాడు. వాడు మాత్రం నిశ్చింతగా నిద్రాదేవి ఒడిలో వుంటాడు.

ఈ దౌర్భాగ్యపు రోజులు ఇంకా ఎంతకాలం కళ్ళచూడాలో?

ఎదురుగా లాడ్జిలోంచి ఇద్దరు మనుషులు రోడ్డుమీదకు వస్తూ సూరయ్యకు కనుపించారు. పక్కనున్న రిక్షావాడి కడుపు నిండుగా వుందేమో ఇంకా నిద్రాసుఖం అనుభవిస్తున్నాడు.

వారిలో ఒకడు గొడుగు తెరిచాడు. రెండోవాడు చేతిలో పర్సు జేబులో పెట్టుకున్నాడు.

"రిక్షా! మార్కెట్టుకి వస్తావా?"

"ఎందరు సామీ?"

"కనపడటంలే - ఇద్దరం"

ఎదురుగా పిల్లపర్వతాలలా ఇద్దరు.

"పన్నెండు రూపాయలు" అన్నాడు సూరయ్య.

"ఇక్కడున్న మార్కెట్టుకి పన్నెండా? రోజురోజుకీ మీ ఆశ పెరిగిపోతున్నాది. ఆరు రూపాయలిస్తాం."

"కిట్టదు బాబూ! పోనీ పది ఇవ్వండి."

"మరో చిల్లిపైసా ఇవ్వం. ఇష్టమైతే రా. లేకుంటే నడిచిపోతాం."

సూరయ్యకు తెలుసు వాళ్లు నడిచి వెళ్ళలేరు. తాను బిగుసుకు కూర్చుంటే వాళ్ళే ఎక్కుతారు. కాని పోటీ ఒకటి తగలడింది. పక్కవాడే లేస్తే తన కీ బేరమూ ఉండదు. వీధి కొళాయి నీళ్ళే గతి అవుతాయి.

"మరి ధర్మప్రభువులు మా కష్టం గమనించాలి. ఏం చేస్తాం. నా రోజులు బాగా లేవు. ఎక్కండి" అన్నాడు.

రిక్షా బయలుదేరింది. సూరయ్య అలసిన ప్రాణం మెల్లిగా రిక్షాను ముందుకు నడిపిస్తున్నాది. అంతలో ఎగుడు రోడ్డు వచ్చింది. దానిమీద ఖాళీ రిక్షాను తొక్కడమే కష్టం. పిప్పళ్ళబస్తాల్లాంటి ఇద్దరు శాల్తీలు. సూరయ్య కిందకు దిగి రిక్షాలాగడం మొదలుపెట్టాడు. యవ్వనంలో అయితే సునాయాసంగా బండి తొక్కేవాడు.

"బాబూ! కాస్త దిగుతారా? అంతా అప్."

"ఏంటీ? మేం నడవాలా? మరి నీకు బాడుగెందుకు ఇస్తున్నట్లు?"

"అంత దూరమూ నడవమనడంలేదు. మూడుబారల దూరం నడుస్తే దిగుడు వస్తుంది. బక్క ప్రాణాన్ని, పోనీ ఒక్కరైనా దిగండి" ప్రాధేయపడ్డాడు.

మానవత్వంలేని మొండి మనుషులు. వారు దిగలేదు. రిక్షా ఎంత ప్రయత్నించినా ముందుకు సాగలేదు. సూరయ్యకు చెమటలు పట్టాయి.

"నేరక ఎక్కాం. పద నడచిపోదాం" అన్నాడు ఒకతను. ఇద్దరూ దిగారు. మార్కెట్టు ఎదురుగా కనిపిస్తున్నది.

"అయ్యా! నా బాడుగ!"

"ఏంటీ? నీకు బాడుగా? నడచి వెళ్తున్నందుకా?" వాళ్లు వాడి నలక్ష్యం చేసి వెళ్ళిపోయారు.

సూరయ్య వాళ్ళను చూస్తూ వుండిపోయాడు. కష్టపడ్డాడు కాని ఫలితం దక్కలేదు. ఈ రోజు లేచిన వేళావిశేషం మంచిది కాదు.

మరో రిక్షావాడైతే ఈ రోజు లేచిన వేళావిశేషం ఎంత మంచిది అనుకునేవాడు. సూరయ్య పరుల సొమ్ము నాశించే మనిషి కానందున రిక్షాలో పడివున్న పర్సుని చూసిన తరువాత కూడా అలా అనుకోలేకపోయాడు. వాళ్ళ పొట్టలలాగే పర్సు పొట్ట ఉబికి నోట్లు బయటకు కనుపిస్తున్నాయి. అదృష్టదేవత తన తలుపు తట్టిందా?

సిరిరా మోకాలడ్డేవారు కొందరుంటారు. నిశ్చయంగా వారు సూరయ్యలే.

ఈ పర్సు నాది కాదు. ఇందులో నా డబ్బు లేదు. పాపిష్టి సొమ్ము తను ఉంచుకోలేడు. స్వగతంగా అనుకున్నాడు. వాళ్ళు మార్కెట్టుకేగా వెళ్ళింది. ఎంత సేపో కాలేదు. తను బండిని జోరుగా పోనిస్తే వాళ్ళను పట్టుకోగలడు. ఆ డబ్బు వారికిస్తేనే కాని అతనికి ప్రశాంతి లేదు.

సూరయ్య విజయాన్ని సాధించాడు.

"బాబు! మీలో ఎవరిదో పర్సు నా బండిలో పడిపోయింది."

ఒకతను ఆందోళనగా పర్సు తీసుకున్నాడు.

"డబ్బు లెక్కపెట్టు. ఏమో ఈ రోజుల్లో ఎవరినీ నమ్మలేం. కొంత కాజేసాడేమో?" రెండో వాడన్నాడు.

న్యాయానికి రోజులు కావు. తానే కక్కుర్తి పడితే వాళ్ళను వెతుక్కుంటూ వచ్చేవాడా? అయినా తనది దొంగ బుద్ధి అనుకుంటున్నారు. భగవంతుడా వారి కళ్ళలో నన్ను దొంగని చేయకు అనుకున్నాడు.

"సరిపోయింది" అన్నాడా వ్యక్తి.

అతను ఏదో ఆలోచనలో మునిగిపోయాడు. తన చేజారిపోయిన సొమ్మును తిరిగి ఇచ్చిన ఇతనికెంత ఇవ్వాలి? అందులో ఏభై వంద రూపాయల నోట్లు ఇంకా మరికొన్ని చిల్లర నోట్లూ వున్నాయి. కొందరు ఎంగిలి చేతితో కాకిని కొట్టలేరన్న సామెత ఊరికే రాలేదు.

వంద ఇవ్వాలా? ఏభైచాలదా? ఏభైయ్యే! - పాతిక ఇస్తే సంతోషిస్తాడు వాడి సంతోషానికేం. పది అయితే వాడికి బాగానే ముట్టచెప్పానన్న సంతోషం తనకూ ఉంటుంది. అతని ఆలోచన అదేనేమో?!

పదిరూపాయలు తీసాడు. "తీసుకో" అన్నాడు.

"నా దగ్గర చిల్లరలేదు సార్! ఆరు రూపాయలిప్పించండి" అదే నా బాడుగ.

"నేను సంతోషంగా ఇస్తున్నానురా!"

"వద్దు బాబు. పాపిష్టి డబ్బు నాకు వద్దు. నా కష్టార్జితం నాకు చాలు."

అతడు ఆరురూపాయలు తీసి ఇచ్చాడు.

నేనెందుకు బ్రతుకుతున్నాను? అనుకున్నాడు సూరయ్య.

రోజులా తొమ్మిది గంటలకు ఇల్లు చేరాడు - అర్ధాకలితో.

వాడు ఇప్పుడే వెళ్ళి వుంటాడు - ఎప్పుడొస్తాడో? దొంగ బ్రతుకూ వీడూనూ. ఏ రోజైనా పోలీసులకు పట్టుబడితే? ఆ ఆలోచనను మనసు లోనికి రానీయకూడదనుకుంటాడు. కాని అది రాకా మానదు - అతడ్ని కలిచివేయకా మానదు.

వాడు ఇంటికి వచ్చాడు దొంగలా.

తాతయ్య నిద్రపాడవకూడదని దొంగలా వస్తాడు. కాని వాడికేం తెలుసు తను నిద్రపోవడం లేదని. మార్తాండ్ ఓ చాప పరుచుకుని పడుకున్నాడు. వాడికి ఇట్టే నిద్ర వచ్చింది. అదృష్టవంతుడా? అలాగెందరకు నిద్రవస్తుంది? తన దృష్టిలో ఏమైనా వాడి దృష్టిలో వాడు అదృష్టవంతుడేనట.

రోజూలాగే సూరయ్య కోడికూతతో లేచాడు. ముఖం కడుక్కొని వచ్చేసరికి మార్తాండ్ మరో పక్కకు వత్తిగిల్లి ఉన్నాడు. వాడి తల పక్కనున్న దేమిటి?

పర్సు!

ఆశ్చర్యం వేసింది.

అదే పర్సు.

ఆ వ్యక్తి తన బండిలో పారేసుకున్నాడు. తాను వాళ్ళను వెతుక్కుంటూ ఇదే పర్సును వారికి అందజేసాడు. వాళ్ళలో ఒకడు తనది దొంగబుద్ధి అని శంకించాడు. తనది దొంగబుద్ధి కాదని ఈ పర్సే నిర్ధారించింది. ఇదే పర్సు తన ఇల్లు వెతుక్కుంటూ వచ్చింది. పాపం! వాళ్ళ దురదృష్టం.

సూరయ్య ఆలోచించాడు. పర్సు తీసాడు. మార్తాండ్ నిద్రపోతూనే వున్నాడులాగుంది. పర్సు తెరచిచూసాడు. వంద రూపాయల నోట్లు చెక్కు చెదరలేదు.

వాళ్ళను వెతుక్కుంటూ వెళ్తాడు. వాళ్ళ సొత్తు వాళ్లకిస్తాడు. తనుండగా వీడు పాపిష్టి సొమ్ము తినరాదు.

అడుగుముందుకు వేసాడు.

"తాతయ్యా! అది నా కష్టార్జితం. నా పర్సు నాకిచ్చేయి" మార్తాండ్ లేచి అంటూనే తాతయ్య చేతిలో పర్సు లాక్కున్నాడు.

"నేను కష్టపడి సంపాదించింది ఎవరికో దానం చెయ్యాలనా నీ వుద్దేశం?"

సూరయ్య 'వీడు మారడు' అనుకుంటూ ఒక్క అడుగు ముందుకి వేసి నేలమీద పడ్డాడు. ఇంకా తెల్లవారక మునుపే సూరయ్యలోని సూర్యుడు అస్తమించాడు.

"తాతయ్యా!" బావురుమన్నాడు మార్తాండ్. తాత చావుకి తను కారకుడు. అతడ్ని సుఖపెట్టలేదు. పైగా దుఃఖపెట్టాడు.

తాతయ్య శవాన్ని చూసాడు. దుఃఖం పొంగి పొరలింది. చేతిలో పర్సుని చూసాడు. తన తాత చావుకి ఈ పర్సు కారణమా?

కాదు... ఇది తన మొదటి దొంగతనంకాదు.

కాదు... ఇంతవరకు తానేం చేస్తున్నదీ తాతకు తెలుసు, కాని దొంగగా పట్టుపడడం ఇది మొదటి మారు.

వీధిలో రిక్షా! అది మూగది. స్వచైతన్యం లేనిది. తన యజమాని సూరయ్య ఇక తనను ముద్దుగా చూడడని దానికి తెలియదు. తెలిస్తే విలపించకుండా వుంటుందా?

మార్తాండ్ ముందు ఒకధ్యేయం. తన తాత ఆత్మ శాంతించాలి. అందుకు తను చేయవలసినది ఒక్కటే! సముద్రంలో తరంగాలవలె జీవితంలో సుఖదుఃఖాలు వస్తూపోతూ ఉంటాయి. తాత ఆత్మకు శాంతి చేకూరాలంటే తను తాతయ్య రిక్షాను ఏకాకిని చేయకూడదు.

మార్తాండ్ కళ్ళలో ఒక వెలుగు. అప్పుడే బాలభానుడు ఉదయించేడు.

**- నడుస్తున్న చరిత్ర - మాసపత్రిక**

**అక్టోబర్ 1997**